# చెంచి

గూడూరు రాజేంద్రరావుగారు

చెఱువు లన్నిట్లో కలిగిరి చెఱువంటే మృగాల్లో మృగరాజులాంటిది; వృక్షాల్లో అశ్వత్థమంటిది. ఆకలిగిరి చెఱువు నడివేసవి కాలాన ఒకసాయంకాలము కడుపునిండ గుడిచిన లేగదూడలాగ గట్లు నాక్కొంటు, తనపై బడే సూర్యకిరణాల గిలిగిలింతలకు యెగిరి గంతులువేస్తూ ప్రకృతితో నాడుకొంటూంది. గట్టుక్రింద తొడలపైకి తన చిఱిగిన చిన్నిచీర నెగగట్టి, చాలిచాలని పవిటను మళ్లించి నడుముకు జుట్టి, మాటిమాటికి కండ్ల కడ్డమువచ్చే కుఱుచ వెండ్రుకల నప్పుడప్పుడూ వెనుకకు దిద్దుతూ, తనలో తానే చిఱునవ్వు నవ్వుకొంటూ, అలల నాదములో తనస్వరమును మేళవించి, నిమ్మళంగా ఒక్కొక్క నుడుగు గొణుక్కొంటూ, గుడ్డ లుతుక్కొంటూంది చెంచి. కొంతసేపటికల్లా, దూరాన కట్టమీద మోజాల కిర్రుశబ్దం వినొచ్చింది. చేతిలోని తడిబట్టను కాళ్లమధ్య నుంచుకొని, తటాలున పైట విప్పి పండ్లతో బట్టుకొని, రెండుప్రక్కల సద్దుకొని కట్టవైపు చూచింది. చచ్చిన సీపాయీల బూడ్సులు, చాకలాడి మొగం జూడని బొంతనిజారు, మాసికలు వేసిన చొక్కా, దానిపై నొక అఱచొక్కా, మెడలో నల్లదారం, చేతిలో ముళ్లదుడ్డు కఱ్ఱతోటి తెల్లని కాబూలా డొకడు ప్రత్యక్షమైనాడు.

చెంచికేసి కన్నార్పకుండా చూడడ మారంభించాడు. "బాబో! ఈగుడ్డల్లో దుమ్మంతా దులిపితే చెఱువెల్లా బుఱదలై పోతుందేమో" ననుకొని చెంచి పక్కున నవ్వింది. తన్ను జూచి నవ్విం దనుకొన్నాడు కాబూలాడు. రసికుడు తనభావాన్ని వెలిపుచ్చడానికి, చికిలి చేయని యిత్తడిరేకులాంటి పల్వరసను బయట బెట్టాడు. చెంచికి భయమేసింది. గుడ్డలు జవురుకొని కట్ట దిగి తన గుడిసెవంకకు వడివడిగా నడిచింది. చీకట్లో దయ్యాలభయ ముండే పిల్లవాండ్రలాగా వెనక్కి తిరిగి తిరిగి చూస్తూ ఊరిబయటనే వుండే గుడిసె చేరి చెంగున లేడిపిల్లలాగ యెగిరి గుడిసెలో బడ్డది. లోపలినుండి పాముపిల్లలాగ తొంగిచూచింది కట్టవంక. కాబూలాడు మైలురాయివలె నిల్చొని చూస్తున్నాడు. ఆరాత్రి కలలో, కట్టమీది కాబూలాడినవ్వు కనబడ్డది చెంచికి. చెంచి మగడి దగ్గరకు మఱింత జరిగి నిద్రలోనే గట్టిగా వాని కావిలించుకొన్నది. మఱికొంతసేపటికి ఉలికిపడి పెద్దగా కలవరించింది. చెంచుగాడు "పిల్లా! పిల్లా!" అని తట్టి లేపాడు.

"నన్ను కఱుచుకొని పండుకో మామా. కలలొస్తుండాయి. బయమేస్తుండది." అని నిద్రపోయింది మళ్లా చెంచి.

మఱునా డుదయ మయింది. చెంచుగాడు, చెంచి పంతులింటికి పని కెళ్లారు. "నాకేమో

కళ్లు మసకలు గమ్మిన ట్టుండాయి పిల్లా! మంటలంటే ఆ పసురు బోసినా డమ్మో్యరు. అప్పటినుంచి కళ్లోకటే దురద. చీకటి గమ్మిన ట్లుండాయి" అన్నాడు కండ్లు నలుపుకొంటూ చెంచుగాడు, రెండవచేత్తో నీళ్ల కావిడి బట్టుకొని. "నీకళ్లు బాగలేకపోతే నాకన్నొకటిస్తాలే మామా, నీ కొకటి నా కొకటిచాలు" నన్నది పిచ్చినవ్వు నవ్వుతూ చెంచి. ఇద్దరూ నవ్వుకొంటూ మాట్లాడుకొంటూ నీళ్లు దెస్తున్నారు కరణం పంతులికి. కొంతసేపటి కల్లా చెంచుగాడు గబాలున నవ్వు చాలించి, "ఆ వొచ్చే మాసెవరు పిల్లా, బాగా చూడు" అని భయముతో అన్నాడు. చెంచినవ్వు పెదవులపైనుండి పిట్టలాగ యెగిరిపోయింది. యెందుచేతనో శరీరం వడకింది. పైకి మాత్రం గుండె దిటువుతో, "వా డెవుడో సాయిబులే" అంటూ మగడిప్రక్క కొదిగింది. "యెవుడో సాయెబు గాదే. మనకు గుడ్డలిచ్చిన కాబూలాయిన గదో?"

"మన కెప్పు డిచ్చినాడు గుడ్డల?"

"ని వ్వెరగవులే. మనపెండ్లికి ఆయినదగ్గిర తెచ్చినా అప్పుకు గుడ్డలు. వొదిలి పెట్టడు గామాల్నే యెట్టబ్బా!" అంటుండగానే కాబూలాడు కఱ్ఱ నేల తాటిస్తూ సమీపించాడు. చెంచుగాడి కేమి మాట్లాడనూ తోచలేదు. కాబూలాడు కొడ్తాడేమో ననేభయాన్ని కప్పిపుచ్చడానికి వెఱ్ఱి చిఱునవ్వు నవ్వాడు పెద్ద కుక్క యెదట కుక్కపిల్లలాగా.

చెంచి నీళ్లకడవతో నాలుగడుగు లావలికి నడిచి తిరిగి కోరచూపులు చూస్తూ నిలబడ్డది. పోవడానికి వీలు లేదని తెలిసీగూడా ముఖం చిట్లించుకొని "రా మామా, యెండబడ్డది." అని పిలిచింది తప్పంతా చెంచుగాడిదైనట్లు. చెంచిగాడు బడికి బొయ్యే పిల్లానిలాగా మొగం వేలవేశాడు. కాబూలాడు వాని చెవ్వు పట్టుకొని "మా బాకీ కట్టావా లేదురా? యేంజబాబ్" అంటూ చెంచివంక జూశాడు నాటకాల్లో రాజువేషగాడిలాగ. చెంచుగాడికి ముఖం చిన్నబోయింది. "వదిలి పెట్టయ్యా! కట్తాం గాని మహాడబ్బు" అని విదళించాడు. చెంచికండ్లు కావుర్లుగమ్మాయి. "నొప్పిగదంటయ్యా చెవు బట్టుకుంటే. వదిలి పెట్టు" అన్నది. దానినోటిమాట కానందించాడు కాబూలాడు. వదలిపెట్టి "అయితే నీ మొగ్గి బాకీ నువ్వు తీర్చేమో, వాడ్కి నెప్పిబొతే" అన్నాడు. చిఱునవ్వుగూడా నవ్వాడు. "తీర్చుకొంటాములే" అని గొణిగింది చెంచి. "సందాల కట్టెయ్యాలబ్బా బాకీ. వాయిదా పానాదినా ల్లయిపోయింది; ఖబడ్దార్" అంటూ వెళ్లిపొయ్యాడు కాబూలాడు.

"మనపెళ్లికి దెచ్చిన కోకా పంచా అప్పా మామా?" అని అడిగింది కొంతదూరం నడిచి చెంచి. "ఊం" అన్నాడు. మఱేమీ మాట్లాడకుండా నడచిపొయ్యారు ప్రక్కప్రక్కన్నే. ఆ పగలంతా పంతులోరింట్లో తీరనిపని యిద్దరికిన్నీ.

చీకటి బడుతోంది. చెంచుగాడు సగమల్లిన యీతాకుల చాపపాయమీద గూర్చొనిడోలువాయిస్తున్నాడు మిణుగురు పురువుల్లాంటి చుక్కలజూస్తూ. చెంచి వానికెదురుగ్గా.

"సముద్రాలు దాటిపోతే
సక్కనైన తోపు లుండయి
సల్లగా ఆచెట్ల నీడల
సరస మాడుదమా! మామా తారి
పోవుదమా"]

అని పాడుతోంది మెల్లగ చిందుదొక్కుతూ. "ఆపదము గాదు పిల్లా! సందమామ పదము పాడు" మంటున్నాడు చెంచుగాడు. కాలయముడిలాంటి కాబూలాడి కాళ్ల జోడు శబ్దం వినొచ్చేసరికి అప్రయత్నంగా డోలాగిపోయింది. పదం నిలిచిపోయింది. వెన్నెలల వంటి వాళ్లనవ్వులకి మబ్బు లడ్డమయినాయి. తుపాకిగుండు దూరిన పిట్టగూటిలాగ వారి కుటీరం నిశ్శబ్దసమాధయిపోయిం దొక్కక్షణములో.

కాబూలా డారంభించాడు : "ఏంరా! ఏయీహూపాయలు".

చెంచుగాడు : "ఎవ్వరిస్తారు సాయిబయ్యా దిక్కులేనోళ్లకు మాకు. నాలుగుదినాళ్లు నిదానించయ్యా, యాడన్నా కుదవుండి నీబాకీ గట్టుకొంటాము."

"అరే! పాప్మని ఇన్నాళ్లుంటే యింకా నాల్గుదినాళ్లు? వహ్వా! నాయాన్కి కాలంల్లేదేరా యిష్టు. కడ్తావా లేదా చెప్పో."

చెంచుగాడు బిత్తరి చూపు లారంభించాడు. చెంచి తల వంచుకొని, "నీబుణాన బోము లేవయ్యా, గొంతుమీద గూసుంటే యెట్ట, యే అయ్యాకాళ్లన్నా బట్టుకోని చాకిరిజేసి దీరస్తాములే" అన్నది దీనంగా. సాయెబు మరొకచిఱునవ్వు నవ్వాడు. "ఔతే మాదుకానాన్కి పనికి రారాదు. మెవ్వురు అయినా మాత్రం మెక్వా యిస్తారా" అన్నాడు చెంచి నడుమువంక జూస్తూ. "అట్లే వస్తాలేయ్య రేపుటినుంచి; తమురంగటి కొస్తా లేయ్య" అన్నాడు చెంచుగాడు సంతోషంతో.

"నీపెళ్లాంగూడా వస్తే జల్దీగా బాకీ పైసల్గాదూ?"

"నేను రాను లేయ్యా! పంతులింట్లో పని జెయ్యాల. కూడుబెట్టే మారాజులు గదయ్యా వోరు. మామామ వొస్తాడులేండి."

కాబూలా డింకేమో అడగదలచికొన్నాడు; కాని మాట రాలేదు. కొంతసేపు నిలబడి "మీాయిష్టం. బాకీమాత్రం మీాహిష్టం" అంటూ తిన్నగా కదలిపొయ్యాడు. వాడు వెనక్కి తిరిగినప్పటినుంచి చెంచికి పట్టరాని నవ్వు. ఆత్రతగా డన్నము దురుక్కొన్నట్లు నోటినిండ గుడ్డబెట్టుకొన్నది. కాని కండ్లు నవ్వు లొలుకుతున్నాయి. కళ్లెంబడి పసిమి ఎండలో వానచినుకుల్లాగ నీటి చుక్కలు రాలాయి. కాబూలాడు దూరమై పోయిన తర్వాత గుడ్డ దీసీ కలకల నవ్వుతూ, "మామా! సాయిబుకొలువుకు బోతే అట్లాంటి సల్లాడ మొకటి దెచ్చుకో. చెఱొక కాలిలో బండుకోని దాగుడుమూత లాడుకొందాం"

అంటూ డోలావలికి నెట్టి, చెంచుగాడి ఒడిలో యెగిరి కూర్చుని పదిమార్లు ముద్దెట్టుకున్నది, మార్చి మార్చి రెండు చెక్కిళ్లూ. చెంచుగాడా చెంపా యీచెంపా దిప్పుకొంటూ కూచున్నాడు అవ్వదగ్గిర ముద్దుగార్చే మొద్దబ్బాయి లాగ.

మఱునా డుదయాన చెంచి పంతులింట పనిచేసి గుడిసె కొచ్చింది. యెన్నడు జంట బాయని దోసాన దాని కా ఒంటిపాటు దుర్భరంగా తోచింది. విసుగెత్తి చాపకట్ట ముందు వేసుకొని మెల్లగా అల్లుకొంటూ కూనరాగాలారంభించింది. కొంత సేపటికి నిద్ర వచ్చి చెఱగు బరచుకొని నిద్రపోయింది. నిద్రలో మోజాల కిఱ్ఱుశబ్దం వినవచ్చినట్లుండింది. ఉలికిపడి లేచి కూర్చున్నది. కల గాదు. వాకిట కాబూలాడు కూర్చోనున్నాడు తన మందహాసముతో. "మా మామేడయ్యా?" అన్నది పాప మాతురతతో. కాబూలాని చిఱునవ్వు ముదిరి నవ్వయింది, తొండ వూసరవెల్లయిన లాగా. "బలే మొఱునబ్బా మీ మామక్కి సూస్తే నీకు. మామిందగూడా అశ్నే వుండ్రాదు" అన్నాడు. చెంచి తల వంచుకొన్నది. దేహం కంపించింది. చెమట బట్టింది. "మామా! మామా!" అని కేకలు వేసింది, మామ లేడని తెలిసి గూడాన్నూ. "మాయింట్లో వొడ్లు దస్తా వుండే మామ యిక్డ యెక్డ వుండాడు. పోనీలే. ఈకోక సూడు, నీకు బాగా వుంటాదేమో" అంటూ ముందుకు జాచాడు పసుపు పువ్వుల కోక. "మా కెట్లా వొస్తాయయ్యా పేదోళ్లకు" అంటూ గుడిసెలోనుండి బయటబడి కరణంపంతులింటివైపు పరిగెత్తిపోయింది పిల్లికూనలాగ. పంతులుగారి సందువాకిట వేపచెట్టు నానుకొని కూర్చున్నది చెంచి మగడు వచ్చే దారి చూస్తూ. వాడు రాగానే కాబూలాడి కథంతా చెప్పా లనుకొన్నది.

మళ్లీ ఆలోచించుకొన్నది. "మామ మాత్ర మేమిచేస్తా డా రాకాసోడ్ని. కాకంటే మొఱుసులో మఱీ దిగులుపడతాడు. యెందుకులే చెప్పేది. దేముడుండాడులే నాయమన్యాయం విసారించను" అనుకొని పొంగి పొర్లి వచ్చే ఏడుపు నాపుకొన్నది. చెట్టునీడను చల్లగాలికి నిద్రొచ్చింది. పసిబిడ్డలాగ కన్నీళ్లతోనే నిద్రపోయింది. చెంచుగాడు ప్రొద్దుకొండలో బడేవేళ కొచ్చాడు తూలుతూ సోలుతూ. వాడికూత విని ఉలికిపడి లేచి గుడిసెకాడికి బోయింది.

"గంజి దాగు మామా! య్యే మట్లుండావు. ఆడ తవుడక లాడుతుండావేమి మామా, గుడిసెవాకి లీడుంటే?"

"నాకు కళ్లవుపడ్డంలేదు చెంచా! సూదలు గుచ్చిన ట్టుండాయి. దినమంతా ఒడ్లుదంచి అదిరిపోయినా యబ్బా, అసలే మసకలు గమ్మిన ట్టుండిన కళ్లు. ఈ కళ్లింక అక్కరకొచ్చే దేందో పిల్లా" అన్నాడు బాధతో యేడుస్తూ. చెంచి మగడికళ్లు దడివింది. రేపుటి నుంచి వాడికొంపకు పోవొద్దు లే మామా! మెట్టయితే అట్టవుతుందిలే. పాణం సరిగ్గా

వుంటేగదా మామా, అన్నీ సుకాలు. బాకీలూ" అంటూ చెంచుగాడిచేయి బట్టుకొని మెల్లగా తీసుకపోయింది గుడిసెలోకి. "యే గుంటలో నన్నాపడి సస్తా మనిపిస్తోంది పిల్లా, ఆబాకీ బ్బాద పడేదానికన్నా. నా కీకళ్ల రోగం కుదరదు. యెట్ట దీరుతుందబ్బ యింతప్పు. ఒకటి అర గాదే, ఆరురూపాయిలు. దానికి చణానికి ఒడ్డిగట్టేవా డాపాపిష్టి సాయెబు" అన్నాడు మోకాళ్లపై గడ్డ ముంచి కూర్చొని చెంచుగాడు. చెంచికండ్లనుండి నీటిధారలు కారసాగాయి. కన్నీళ్లు దుడుచుకొని, "దిగులు పడొద్దులే మామా! మా అమ్మగా రూరికి పోయి తీసకొస్తాలే మా అమ్మ నడిగి డబ్బు. నన్నుంచి నీ కెందుకు మామా, కష్టం." అన్నది.

మఱునాడు రెండుబారల ప్రొద్దెక్కింది. చెంచుగాడు బాధతో మూలుగుతున్నాడు. చెంచికి రాత్రల్లా నిద్ర లేక మొగం వాడిపోయింది. మొగుడి కండ్ల కేవో చికిత్సలు జేస్తోంది. "మెల్లంగా మెల్లంగా పిల్లా" అంటున్నాడు పాపం బాధ కోర్వలేక.

"గుడ్సిలో చేరుండారే యిద్దూ: పెళ్లాం షోక్లో పని మర్చిపొయ్యా వేంరా? భేష్! భలే నౌఖరయిందే మాకు. మీసుట్టూ తిర్గతుండడం" అని వినొచ్చింది కాబూలాడికంఠం. చెంచుగాడు నిద్రలో బిడ్డలాగ ఉలిక్కిపడ్డాడు. చెంచికి చిరా కెక్కువైపోయింది.

"తెల్లారకతిలకే వొచ్చి కూసుంటా వేమయ్యా! మాయిమెటుకుపాణాలుగదూ. సావుబతకల్లో వుంటే యేమిటని, పోయ్యా. ఈ యాళ రాడు పో" అన్నది వడకే గొంతుతో.

"రాకోతే జుట్టు పట్కొని లాక్కపోతాం, వద్దు కొంటాం? వ్వారే! దొంగ చేష్టా ల్మాదగ్గా" అంటూ గుడిసెలోకి దూరాడు ఆగ్రహంతో. చెంచి పెద్ద పెట్టున యేడ్చింది. నీకాళ్లకి మొక్కతా సాయిబయ్యా! మామామ నేమనొద్దు. బాదతో వుండాడు మాతండ్రీ!" అంటూ వాని దుమ్ము నిండిన నల్లమోజాలపై వ్రాలిపోయింది. మోజాలపై బడ్డ కన్నీటిబొట్లు చారలుగ క్రిందికి దిగజారకం ప్రాణములేని చెప్పులుగూడ కంట తడిబెట్టిన ట్లుండింది.

కాబూలాడి కాగ్రహ మాగిపోయింది. వంగిన చెంచి నల్లని మెఱుగువెన్నుపై చేతితో తిన్నగా దిగచఱిమాడు. పందెపు పావురాన్ని బట్టుకొన్నట్టు దాని సన్ననినడు మొకక్షణము బట్టుకొని వదలేసి లేచాడు. "రేపుమెల్లుంట్లో కట్టండబ్బ. ఆనాక అగ్గో యిగ్గో అంటె పర్యోజనం లేదు" అంటూ వెళ్లిపొయ్యాడు కాబూలాడు.

చెంచి కీమాటు నవ్వు రాలేదు. ప్రక్కలెగరవేస్తూ తనలో తానే కుమిలిపోయిందేదుపుతోటి. చీర చెఱగు తడిసిపోయింది వేడికన్నీళ్లతో. మగడి మెడ కావిలించుకొని యేడ్చింది. "మామా! మా అమ్మగారూరికి పోయి డబ్బు తెస్తా. మళ్లీ వస్తా. నేను లేనని దిగులుపడొద్దు మామా! బాకీ దీరినపాట

సుగంగా వుందాములే. నీకళ్లకు మందు రాసుకోని తెప్పన బాగుజేసుకో. చూపు లేకపోతే మన మెందుకు పనికొస్తాము మామా, పని పాటలు జేసుకొని తినాల్చినోళ్లము, పచ్చల్లాంటోళ్లము." అని వెక్కి వెక్కి యేడ్చింది. చెంచుగాడి చీపురుకళ్లనుండి కన్నీటి బొట్లు చాపపైకి జారినాయి. చెంచిని ముద్దిడుకొన్నాడు. మాట రాలేదు. దాని దేహమంతా తడవినాడు.

"తెప్పన రా. అమ్మగారియిల్లని అట్లనే కూర్చోవద్దు. నీవు లేకుంటే నే నుం......" అని యేడ్పు మింగినాడు. "ఊర్కో మామా! మామా, ఊర్కో" మంటూ చెంచి పెద్ద పెట్టున యేడ్చింది. కండ్లు దుడిచికొని బయటి కొచ్చింది గుడిసెలో నుంచి. రెండడుగులు బెట్టింది. చెంచుగాడు, "చెంచా! చెంచా! పిల్లా" అని పిలిచాడు. తిరిగివచ్చింది. "...... యేమో చెప్పాలనుకొని మఱచిపొయ్యాను... పోనీలే పిల్లా! యెదురెండ తే పెప్పుడైనా బోదువులే" అన్నాడు దీనంగా.

"కాదులే మామా! అప్పుదీర్తే మన ల్నడిగేవాళ్లు లేరు. పోయి మా అమ్మను బతిమాల్తా. తెప్పన వస్తాలే మామా. నిన్నుజూడకుండా నే నుండేదాన్నేనా" అంటూ నాలు గడుగులు నడిచింది. కాళ్లు తడబడ్డాయి.

"మామా! యేమంటే......" అంటూ మళ్లా గుడిసె దూరింది. "ఏమోమాట జెప్పాలనుకొని యింతలోకే మఱుపొచ్చింది మామా" అంటూ చెంచుగాడి వాడిన కడుపువంక జూచింది. బోరని దుఃఖము చలిజ్వరములాగ వచ్చింది. మగడి ప్రక్కన బోర్లబడి, "నేను బోను మామా, పోతే నీకు గెంజినీ ళ్లెట్లా? నేను బోలేను మామ. అప్పులో డొచ్చి సంపితే సంపుతాడు లే" అన్నది.

"నీవు పోనేవద్దు లే. అస్తమాన మైనాక పంతులో ర్నడిగి చూదాములే".

సూర్యుడు కాషాయాలు గట్టుకొని అడవులు కొండలు దాటి వెళ్లిపోయాడు. చెంచుగాడిచేయి బట్టుకొని మెల్లగా నడిపించక పోయింది పంతులోరింటికి చెంచి. కరణం వీధి గుమ్మం దగ్గర గూర్చొని చుట్ట గాలుస్తున్నాడు. చెంచి పంతులెదుట చేతులు గట్టుకొని తన సవిస్తారమంతా చెప్పకొన్నది. చెంచుగా డప్పుడప్పుడు అందుకొని ఒక్కొక మాట జెప్తుండేవాడు. డబ్బుమాట వచ్చేటప్పటికి కరణం పంతులు రూపమే మారిపోయాడు. చుట్టపీకి ఆవల పారవేశాడు. "మీ థాళ్లెట్లయినా ఛెంచుకోండి. ఈ వెధవవేషాలు నాకు బనికిరావు. ఇంట్లో అంట్లు దోమడానికి దోవ లేదు గాని, డబ్బట డబ్భు! వెళ్లండి వెళ్లండి" అంటూ లేచిపోయాడు తుఱ్ఱున, అత్తమీద అలిగిన అల్లునిలాగా. చెంచి చేతులు పిసుక్కుంటూ నిలబడ్డది.

ఆలుమగలు పందువాకిట్లోకి పొయ్యారు. పంతులుభార్య చేత గరిటె బట్టుకొని వంటింటిలోనుండి యెవ్వరంటూ బయట కొచ్చింది.

చెంచి గబాలున ఆమెకాళ్లమీద బడి, "రక్షించమ్మా, లచ్చిమి దేవమ్మా, రక్షించు" అని యేడ్చింది. కాబూలాని గుండె గరిగించిన తన యేడ్పు పంతులుభార్యకు కరుణ బుట్టింపదా అనుకొని మళ్లీ యేడ్చింది. లచ్చిమి దేవమ్మ చెంచి నెత్తిన ఇనుపగరిటతో ఒక్క మొట్టు మొట్టి, "మడి గట్టుకోని వంట జేస్తుంటే వళ్లు తెలియక తాకుతావా వెధవా ?" అంటూ లోపలి కెళ్లింది. పంతులుకూతురు, యేదో నవల జదువుకుంటుంది, యేమిటోనని కిటికీ దీసి చూచి, "అయ్యో, పాపం" అంటూ మళల కిటికీ గట్టిగ మూసివేసింది.

దిక్కు లేని దంపతులు గుడిసెవంకకు నడిచారు, బిడ్డను బూడ్చి వచ్చేవారిలాగా. కొనవఱకు ఒకరి నొకరు పలుకరించుకోనైన లేదు. చూపుచెడిన మగణ్ణి గుడిసెలో వదలి చెంచి బయట నిలబడ్డది. "మామా, నీ కాకలి గదా ! వుండు. బిరాన నాలుగిళ్లకు బోయి కవళం దెస్తా" నని నిట్టూర్పులు విడుస్తూ వూరి వంకకు వెళ్లింది మళ్లా చెంచి. "అనాదవచ్చినమ్మా! ఒక్క కవళ మేయండి తల్లే" అంటూ ఒక్కొకవాకిటా కేకలేయ సాగింది వేదనా మృదులమైన స్వరముతో. కొంతసేపటికే జోలె నిండిపోయింది. ఆరాత్రి మగడు పెండ్లము కడుపునిండుగ దిన్నారు. మిగిలినకూడు ఆవూరి కుక్కలకు వేశారు.

మఱునాడు చెంచుగాడికండ్లు పోటెక్కువై పోయింది. తెప్పలు తెఱవడ మసాధ్యమై పోయింది. దినమంతా పడకే. మూలుగులు హెచ్చినాయి. చెంచి తహతహలాడుతోంది. చేతనైనా వైద్యాలన్నీ చేసేసింది. "నాసూపు దీసుకొని నాపెనిమిటి సూపిచ్చేయి దేముడా" అన్నది సూర్యుడివంక జూస్తూ. చెవిటిసూర్యుడికీ దీనాలాపాలు వినరాలేదేమో, వానికి చూపు రాలేదు. దానిచూపు పోలేదు. సాయంత్రము వరకు తంటాలుబడ్డది చెంచి. యెంతమాత్రం నయము గనుపించలేదు. "పాణంబోతే బాగుండును రామా, ఈబాదకన్నా" అన్నాడు వెట్టి స్వరంతో చెంచుగాడు. జ్వరంగూడా ఆరంభమయింది. చెంచి యేడుస్తూ పరుగెత్తుకపోయి వరిచేలల్లో కావలియుండే ముసలివైద్యుణ్ణో కణ్ణి బ్రతిమాలి పిలుచుకొచ్చింది. "మామామకు సూపు దెప్పించు తాతా ! నీపేరు చెప్పుకొని బతుకుతాము" అన్నది. "బయపడొద్దులే అమ్మా, పొద్దటికి ఆకలిగిరమ్మ దయవొల్ల బాగవుతాది. చెంచయ్యకు కూడు బెట్టు" అన్నాడు ముసలాడు. "బద్రంగా జూసుకో తాతా. కబళము దెస్తాఘణంలో" నంటూ జోలె బట్టుకొని బయలుదేరింది.

చిమ్మచీకటి. పుటపుట చినుకులు రాలుతున్నయి. ఆకసమువంక జూచింది నడుస్తూ. చిన్న తెల్లమబ్బొకటి కుందేలిలాగ గునగున బోతోంది. దాన్ని తరుముచున్నట్టు కారుమేఘ మొకటి వెంబడిస్తోంది. త్రుటికాలములో తెల్లమబ్బు మాయమయింది. కారుమబ్బుల్లో మిళితమైపోయింది.

చెంచికి జాలేసింది. పాప మా చిన్న మొబ్బును మింగేశింది గావాల ననుకొంటూ

అడుగుబెట్టింది. కాలిక్రింద చిన్నకప్ప బడి కీచుమన్నది. దేహం జలదరించి మిడిసి ఆవల బడ్డది చెంచి. చీకట్లో నిదానించి చూచింది. కప్ప కొంత తెప్పరిల్లి ఆలస్యంగా ఆఫీసుకు బొయ్యే గుమాస్తాలాగా గంతులువేస్తూ బోయింది. వెనకన్నే వాయు వేగముతో మఱొక పెద్దకప్ప దానిమీదికి పోతోంది. తెప్పపాటులో చిన్నకప్ప నేల గఱచుకపోయింది. దాని చిన్నమూలుగు పెద్దకప్ప బెకబెకల్లో లీనమైపోయింది. చెంచి కేవో విపరీత భావాలు స్ఫురించాయి. విషాదపు చిఱునవ్వుతో వెళ్లిపోయిం దూళ్లోకి. కరణంపంతులింటి వాకిట చీకట్లో నిలబడ్డది. గదికిటికీలోనుంచి పంతులు కూతురు ఆవలితట్టున యెవరితోనో, "ఈమాటల కేమిలేండి. పై నెలలో మీకు వేసవికాలపు సెలవు లయిపోయి మద్రాసుకు బోతే నామాటే జ్ఞప్తికి రాదు. మీలోకంలో మీ రుంటారు. ఇక్కడ నా అవస్థ..." అంటోంది. చెంచికి తన దుఃఖములో నవ్వొచ్చింది. అణచుకొని, "అనాదపచ్చినమ్మా" అన్నది. పంతులు కుమార్తె చివాలున తిరిగి, "వచ్చేవాళ్లెవరు లేరు పోవే" అని మఱల కిటికీవంకకు దిరిగింది.

చెంచి చీకట్లో వీథిన బడి పోయింది. దాని కేకలధ్వని దూరానకు జడకొసలాగ సన్నమైపోయింది. నాలుగువీథులు తిరిగింది. జోలి సగమైన నిండలేదు.

ఒక సన్న గొందెలో ప్రవేశించి ఒక యింటివాకిట "కబళ మెయ్యండి తల్లే, అనాద పచ్చికి" అంటుండేసరికే మెలుగుబంటిలాంటి కుక్కొకటి గుఱ్ఱుమని పైన బడిపోయింది అమాంతంగా. పాపము చెంచి చేతిలో జోలె జారిపోయింది. "అమ్మా" అని పెద్ద కేక పెట్టింది. ఇంతలో యెవరో యింటిలోనుండి వచ్చి కుక్కను పట్టుకొన్నాడు. "కట్టెయ్యయ్యా, పాడుకుక్కని; నాపాణా లెగిరిపోయినాయి నాయినా" అన్న దింకా వణుకుతూ. చీకట్లో దానిముఖంవంక పారజూచాడు, కుక్క నొకచేత బట్టుకొని. చెంచి! కాబూలాడు రెండవచేత్తో చెంచిచేయి బట్టుకొని "కర్సొందా" అన్నాడు. చెంచికి కుక్కభయానకన్నా మనిసి భయ మెక్కువయింది గుర్తించింది. "కరవ లేదులే సాయబయ్యా; చెయ్యి విడిపించయ్యా. తెప్పన బోవాల. మామామ కొళ్లు నిమ్మళంగా లే" దన్నది. "పోతువ్లే, రా" అంటూ యింటిలోకీడ్చుకవెళ్లా డొకచేత చెంచిని, ఒకచేత కుక్కని. చెంచి యేడ్వలేదు; అరవలేదు. గుమ్మము దాటేటప్పుడు, మామ, మబ్బు, కప్ప, పంతులోరిపిల్ల, అప్పా—అన్నీ తలలో గిఱ్ఱున తిరిగాయి. మేకపిల్లలాగ వానివెంట బోయింది.

తూర్పు రేకలు మైలయిడుస్తోన్నాయి. సంధ్యమబ్బు లెట్టో లేచిపోయినాయి. ఆకాశమంతా తేట పుల్లనీళ్ల కుండలాగ నిర్మలమైపోయింది. ఒక్కొక్క మూలనుండి అప్పుడప్పుడు కోడికూతలు మాత్రం వినొస్తున్నాయి.

చెంచి అడుగుల్లో అడుగు లేసుకొంటూ, బాటనేళ్లు చూసుకొంటూ వీధిగోడల ప్రక్కన రాచుకొంటూ బోతూంది. దానిభావ ప్రపంచము తారుమారయిపోయింది. తనకు తానే అసహ్యకరమైన వ్యక్తిగ కనుపించింది. మాటిమాటికి ముందుకు వంగి తుప్పతుప్పన తన పొట్టమీదనే ఉమ్మి వేస్తోంది. తన శరీరాన్నప్పుడప్పుడు పట్టి గట్టిగ చీల్చుకొంటోంది. ముంజేతులు పండ్ల గాటుకు గాయాలై పోయినాయి. తల వెంట్రుకలు సగము తెగి దానివేళ్లకు జుట్టుకొన్నాయి. మాసిన నీలిపవిట చీరికలై నేల వ్రేలాడుతోంది. రాతిగోడలకు రాచుకొన్న లేతభుజములు నెత్తుటిగుజ్జయి పోయినాయి. తనలో తానేమో గొణుక్కొంటూ, నవ్వుకొంటూ, మాట్లాడుకొంటూ పోతుంది వీధిన బడి చెంచి. వేకువన పాఠాలు వల్లించను లేచిన కుఱ్ఱవాడెవడో వాకిటనుండి దాన్ని జూచి, "అమ్మో దయ్యమే" అని అరుస్తు తల్లి నానుకొని దుప్పటి గప్పుకొని పండుకొన్నాడు. చెంచి విన్నది. "దయ్యాన్ని, దయ్యాన్ని, భూతాన్ని, రాచ్చేసిని, పంతుల్ని, కాబూలోణ్ణి, లచ్చిమి దేవమ్మను" అని పెద్దగా అరుస్తూ, అరచే కుక్కలను దడిపిస్తూ పరిగెత్తిపోయింది చెంచి వూరు దాటి.

చెంచుగాడికి బాధ తగ్గి నిద్రబొయ్యాడు. వైద్యుడెళ్లిపొయ్యాడు. జ్వరబాధలో వాడికి చెంచి బోయిందే తెలిసుదు. తెల్లవారి మెళకువొచ్చింది. చెంచికోసం చెయిజాపాడు. తవుడుకాడాడు. కొత్తయీతాకులచాప ముళ్లుమాత్రం చేయి దగిలాయి. చెంచి లేదు.

"చెంచా, చెంచా! పిల్లా" అని కళ్లు నలుముకొంటూ మెల్లగా పిలచాడు నిద్రలోలాగ. గుడిసెంతా తడవుకొన్నాడు, నిక్షేపానికి చీకట్లో తన్నడుక్కాడే లోభవానిలాగా. చెంచి లేదు.

కొంతసేపటి గ్రామతలారొకడొచ్చి, "చెంచుగా, బయిటికి రారా! పోలీసులు మునసబుకరణాలు చేరి వుండారు చెఱువుకట్టమీంద. చెంచిని దేవి బయటేశారు, రారా" అన్నాడు. చెంచుగాడి గుడ్డికళ్లలో మెఱుములు మెఱిసినట్లయినాయి. "మా చెంచినా నారయ్యా? మాపిల్లనా నారయ్యా? ఇంకే ముండది దేముడా" అంటూ గుండెలు బాదుకొంటూ కలిగిరి చెరువుకట్ట యెక్కినాడు. వాని వెఱ్ఱి కేకలకు దూరాన పశువులు మేత మాని నిట్టూర్పులు విడువసాగాయి. గ్రామస్థులు "ప్రాణం బోయినా కళ దగ్గలేదు చెంచికి" అని తల లూపారు. పోలీసాయన బుఱ్ఱమీసాలు దువ్వుకొంటూ చాలాసేపాలోచించి, "అయితే నివ్వేనంట్రా దాన్ని చంపి నీళ్లల్లో వేసింది?" అన్నాడు చెంచుగాణ్ణి. "నిజం చెప్పు చెంచుగా, నిన్ను కొట్టడులే అయ్య" అన్నాడు మునసబు. కరణంపంతులు "జాతి తక్కువ వెధవలు లెండి. అదేమో పోకిరిపని జేసి వుంటుంది. ఈకుంఖ దానిగొంతు నులిమివుంటాడు" అన్నాడు. "సోముల్లారా! దణ్ణం

బెడ్తా. మాపిల్లేనా యీమాశి. బాగా సూడం డయ్యా. కళ్లు గానన్నోణ్ణి" అని పెద్దపెట్టున ఏడ్వసాగాడు.

పోలీసుదొర చుట్ట గాలుస్తూ, "అయితే చెంచి బొడ్డుకొంగున ఆరురూపాయి లుండాయి, నీ విచ్చినావంట్రా ?" అన్నాడు. "ఓరి దేముడా! రాత్రితో రాత్రి వాళ్లమ్మగా రూరికి బోయి బాకీ గట్టను రూపాయలు దెచ్చింది గామో సయ్యా మాచెంచి. వొచ్చేటప్పుడు చీకట్లో నేమో పడిపోయిందయ్యా నాయిల యేల్పు" అంటూ పాప మేడ్చాడు. కొందరు గ్రామస్తులు చూడలేక తల లావలికి దిప్పుకొన్నారు. పోలీసాయిన చెంచి శవాన్ని కాల్తో యివతలికి మళ్లించాడు.

"కేసు పెట్తాం, రిపోర్టు రాయండి" అన్నాడు మునసబుతో. మళ్లీ బుజ్జమీసాలు దిప్పాడు ఆలోచిస్తూ. కళ్లులేని చెంచుగాణ్ణి విచారణవరకు చీకటికొట్లో నుంచమన్నాడు. చెంచి శవాన్ని శస్త్రపరీక్ష కివ్వమన్నాడు. తెలివిగ ప్రవర్తించా ననుకొని బైసికి లెక్కి వెళ్లిపొయ్యాడు. కట్టమీద కజ్జ నానుకొని నిలబడ్డ కాబూలాడు, "మొన్న దాన్కి యిక్కడే షూచినాం. మళ్లా యిప్పు డిక్కడే షూస్తుండాం. యేం హాష్చర్యం" అని గొణుక్కొన్నాడు.

చెంచుగాడు, "నా బంగారు చెంచా! మీ అమ్మగారింటికి పోయినావా, నాకు జెప్పకుంటా, మానాయినా" అంటూ దానిపై బడి గొట్టుకొన్నాడు. కరణంపంతులు మునసబువంక జూచి, "చేసి ;వారికి చేసినంత" అంటూ తలూపాడు.

మఱి చెంచి యేమనుకొన్నదో.

